# మనవే'మన పద్యాలు

**ఆ. వె. తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమి? వాడు గిట్టనేమి?**
**పుట్టలోని చెదలు పుట్టవా? గిట్టవా?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు :**
గిట్టనేమి? = చచ్చిన నేమి?

**తాత్పర్యము** : కనిపెంచిన తల్లిదండ్రుల మీద దయతో, వారు పెద్దవారైనప్పుడు వారిని ఆదరిస్తూ, వారి కష్టసుఖములను తెలుసుకుంటూ, వారికి అండగా ఉండని పుత్రుడు పుట్టడం వలన ప్రయోజనం ఏమిటి? చచ్చినందువలన వచ్చిన నష్టమూ లేదు. పుట్టలో చెదలు పుట్టుచున్నవి. చచ్చుచున్నవి. దానివలన ఎవరికీ ఏ విధమైన ప్రయోజనము లేదుకదా! కాన పుత్ర ధర్మముగా తల్లితండ్రులను భక్తి శ్రద్ధలతో గౌరవించుట ఉచితము.

**ఆ. వె. అలను బుడిసి పుట్టినప్పుడె క్షయమౌను**
**కలను గాంచు లక్ష్మి గనుటలేదు**
**ఇలను భోగభాగ్య మీతీరు కాదొకో**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : అల = కెరటము.
బుడిసి = నీటి బుడగ.
క్షయమౌను = నశించిపోవును.
కాంచు = దర్శించు, చూచు.

**తాత్పర్యము:** కెరటాలలో పుట్టు నీటి బుడగ ఎంతసేపు ఉంటుంది? కొంతసేపు ఉండి నశిస్తుంది. కలలో చూచిన ధనధాన్యములు, ఐశ్వర్యములు కూడా కలవీడినంతనే మాయమౌతాయి. అలాగే లోకములో భోగభాగ్యములు గూడా ఇట్లే కాలభ్రమణములో నేడుండి, రేపటికి నశించిపోతాయి. అవి శాశ్వతమనే భ్రమను కలిగిస్తాయి. అశాశ్వతమైన వాటినే శాశ్వతమనుకొని, అందులో చిక్కుబడి కొట్టుకోవడము అజ్ఞానము కాక మరేమిటి?

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*